ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

అబిడ్స్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఆమె అన్నారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా లక్డీకాపూల్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆమెను నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, కోశాధికారి శివ జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, జిల్లా ప్రచార కార్యదర్శి మిర్యాల రాజయ్య, ఉప్పు ఆంజనేయులు, జూలూరి సత్యనారాయణ, ఇతర ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు వాస శేఖర్, గోవింద శ్రీను గంధరవి శంభు ముత్యాలు, కొండూరి కృష్ణయ్య గుబ్బ కిషన్, జూలూరి వీరేష్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కల్వ సుజాత మాట్లాడుతూ..రాష్ట్రంలోని


చైర్మన్ కల్వ సుజాతను సత్కరిస్తున్న కల్మిచర్ల రమేష్, జూలూరి సత్యనారాయణ

ఆర్యవైశ్యుల కోసం ఏర్పడిన మొదటి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని కల్వ సుజాత వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి పూజలు


గోశాలలో గోపూజలు చేస్తున్న పప్పుమాత్రే తదితరులు


గోపాష్టమి పూజల్లో పాల్గొన్న నాయకులు

అబిడ్స్: గోపాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం పలు గోశాలలు గోభక్తులతో సందడిగా మారాయి. బేగంబజార్, ఇమ్లిబన్, రహీంపురా, ట్యాంక్‌బండ్ గోశాలల్లో గోభక్తులు గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. బేగంబజార్ గోశాలలో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు పప్పుమాత్రే, సంఘ సేవకుడు నీలేందర్‌యాదవ్, బాబు గోవులకు గడ్డి, ఇతర పదార్థాలు తినిపించి గోపూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పప్పుమాత్రే మాట్లాడుతూ..సకల దేవతలతో ఉన్న గోమాతను పూజిస్తే మనిషికి ఎంతో తృప్తి, మానసిక ఆనందం, సంతోషం లభిస్తాయని ఆయన అన్నారు.

విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో..

గౌలిపురా: విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో హరిబౌలి చౌరస్తాలోని శ్రీ దసా హనుమాన్ గోశాలలో శనివారం గోపాష్టమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు పాండు చారి, బజరంగ్‌దళ్ ఆర్యనగర్ జిల్లా కన్వీనర్ కె.పవన్ కుమార్, భాగ్యనగర్ ఆర్యనగర్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గోపూజ చేస్తున్న మోహన్ కృష్ణ, నరేందర్, వెంకటేష్

సీతారామ్‌భాగ్‌లో..

నాంపల్లి: సీతారామ్‌భాగ్‌లోని శ్రీ రామచందర్‌జీ హనుమాన్ ఆలయంలో గోపాష్టమి పూజలు వైభవోపేతంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా బజరంగ్‌దళ్ హిందీనగర్ జిల్లా చైర్మన్ మోహన్‌కృష్ణ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ పర్యవేక్షణలో గోపాష్టమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏ–బ్లాక్ అధ్యక్షులు జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ తప్పనిసరి


మాట్లాడుతున్న రామేశ్వర్

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ తప్పనిసరి అని గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ కార్యాలయానికి చెందిన రామేశ్వర్ అన్నారు. యూడైస్ ప్లస్, విద్యార్థుల పెన్ నెంబర్ తదితర విషయాలపై శనివారం గోల్కొండ డిప్యూటీ ఐఓఎస్ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారికి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల వివరాలు, పాఠశాలల వివరాలు పొందుపరిచే యూడైస్ ప్లస్‌లో ఉన్న ప్రతి విద్యార్థికి పెన్ నెంబర్ వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్, అఖీల్, తిరుపతి, విజయ్‌లతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'పురస్కారాలు గుర్తింపుతో పాటు ప్రోత్సాహాన్నిస్తాయి'

సుల్తాన్‌బజార్: సత్కారాలు, పురస్కారాలు సమాజంలో గుర్తింపుతో పాటు ప్రోత్సాహాన్నిస్తాయని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ తాళ్లపాక సందీప్ కుమార్ అన్నారు. విశ్వ ఆర్ట్స్, ఆర్.కె.కళా సాంస్కృతిక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్తీక మాసం నాట్య ఉత్సవం, జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు శనివారం కోఠిలోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికలో ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనతో పాటు శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. అనంతరం జరిగిన కార్యక్రమానికి సందీప్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వివిధ రంగాల ప్రముఖులు సంధ్య, శకుంతల పలువురికి లెజెండరీ సేవా అవార్డులు, పలువురికి నెహ్రూ పురస్కారాలు, ప్రముఖ గాయని వేమూరి మంజులకు సంగీత శిరోమణి పురస్కారం, ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణశర్మకు సాహిత్య శిరోమణి పురస్కారం బహూకరించి అభినందించారు. వేడుకల్లో ప్రతిభ కనబరిచిన పలువురు చిన్నారులకు ఇంగ్లిష్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం చేశారు. లయన్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎస్.బిక్కునాథ్ నాయక్, వేమూరి మంజుల, లయన్ రజనికాంత్, ప్రతాప్‌వంశీకృష్ణ, వేమూరి అనంత రామకృష్ణ శర్మ, డాక్టర్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రముఖులకు అవార్డుల ప్రదానం చేస్తున్న ప్రముఖ నాట్య గురువు సందీప్‌కుమార్

రేపు ఓల్డ్ సిటీ ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్‌షిప్ మేళా

బహదూర్‌పురా: తాడ్‌బన్‌లోని ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 11న అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా పథకంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు ఈ మేళాలలో పాల్గొనవచ్చునన్నారు. ఈ నెల 11న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హతల గల అభ్యర్థులు తమ బయోడెటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9701540045లో సంప్రదించవచ్చు.

స్పెషల్ క్యాంపెయిన్ సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: భారత ఎలక్షన్ కమిషన్ ఈనెల 9, 10 తేదీలను స్పెషల్ కాంపెయిన్ రోజులుగా ప్రకటించిందని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన శనివారం నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో బూత్ లెవెల్ ఆఫీసర్స్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ తమ పోలింగ్ బూత్‌లకి వెళ్లి అక్టోబర్ 29న విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో తమ పేరు ఉందో..? లేదో..? పరిశీలించుకోవాలని కోరారు. అలాగే కొత్తగా నమోదు చేయాలన్న, ఓటర్ లిస్ట్‌లో మార్పులు చేర్పులు చేయాలన్న బీఎల్‌ఓలను సంప్రదించి ఫారంను నింపి ఇవ్వాలని కోరారు. అదే విధంగా చార్మినార్, బహదూర్ పురా, యాకుత్‌పురా నియోజకవర్గాలలో పలు పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు లేనందున ఆయా నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌సతో ఫోన్‌లో మాట్లాడి ఆదివారం అన్ని బూత్‌లలో అధికారులు ఉండాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్, అడ్వకేట్ జాకీర్ హుస్సేన్, శ్రీకాంత్ బోనాలు, నజీర్ ఖాన్, నసీర్ ఫారూకీ పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న రాజేష్ కుమార్

కొనసాగుతున్న సమగ్ర సర్వే

- ఈ నెల 6 నుంచి ప్రారంభమైన సర్వే
- సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కరింగ్

చార్మినార్: పాతబస్తీలో ఇంకా స్టిక్కరింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన స్టిక్కరింగ్ పనులు శనివారం కూడా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కొనసాగాయి. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించిన అనంతరం ఆయా ఇళ్లకు వెళ్లి సర్వే చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా శనివారం కూడా స్టిక్కర్లు అతికించారు. ఇక శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని భావించినప్పటికీ వీలు పడలేదని తెలుస్తోంది.

జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో మలక్‌పేట్ (సర్కిల్–6) శాసన సభ నియోజకవర్గంతో పాటు సంతోష్‌నగర్ (సర్కిల్–7), చాంద్రాయణగుట్ట(సర్కిల్–8), చార్మినార్(సర్కిల్–9), బహదూర్‌పురా(సర్కిల్–10), రాజేంద్రనగర్(సర్కిల్–11) నియోజక వర్గాలున్నాయి. ఈ నియోజకవర్గాల్లోని జీహెచ్ఎంసీ వార్డుల వారీగా సర్వే నిర్వహించడానికి సంబంధిత అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసి సర్వే నిర్వహించాల్సిన ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తున్నారు.


సర్వేను తనిఖీ చేస్తున్న మంగతాయారు, రాజేశ్వరి, సురేందర్‌రెడ్డి


గౌలిపురాలో కొనసాగుతున్న సర్వే


మాట్లాడుతున్న పోల్కం శ్రీనివాస్

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి: జెడ్సీ

ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న ఇప్పటికే చార్మినార్, బహదూర్‌పురా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి సర్వే విషయాలను వారికి వివరించడంతో పాటు సిబ్బంది వారి వారి ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఇలా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే జోరుగా కొనసాగుతోంది. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ తమ సమాచారాన్ని ఎన్యుమరేటర్‌కు అందించి సర్వేకు సహకరించాలన్నారు.

ముందుకు సాగని ఇంటింటి సర్వే..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో సర్వే నత్తనడకన సాగుతోంది. గోల్కొండ, కార్వాన్ డివిజన్లలో ఇంకా స్టిక్కరింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. నానల్‌నగర్ డివిజన్, టోలిచౌకీ డివిజన్‌లలో ఇంకా తమ ఇళ్లకు ఎన్యుమరేటర్లు, బల్దియా సిబ్బంది రాలేదని పలు కుటుంబాలు అంటున్నాయి. అయితే గత రెండు రోజుల నుంచి ఎన్యుమరేటర్లు వచ్చి ఇంటింటికి స్టిక్కర్లు అంటించి పోతున్నారని మరికొందరు అంటున్నారు.

తప్పులు దొర్లకుండా సర్వే చేపట్టాలి..

నాంపల్లి: సమగ్ర కుటుంబ సర్వే నాల్గవ రోజు ముమ్మరంగా కొనసాగుతోంది. సర్వే చేసే ఎన్యుమరేటర్లు నాల్గవ రోజు స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్–12లో జరుగుతున్న సర్వేను ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ మంగతాయారు, సంయుక్త కమిషనర్ రాజేశ్వరి పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డిని అడిగి సమగ్ర వివరాలను తెలుసుకున్నారు. చింతలబస్తీలో జరిగిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని వారు ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు ఎం.నర్సింగ్, ప్రమీలా రాథోడ్, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే విజయవంతం చేయాలి..

అఫ్జల్‌గంజ్: సమగ్ర సర్వే విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే ప్రారంభించిందన్నారు. అన్ని కులాల వివరాలు, రాజకీయ సామాజిక వివరాలు వెల్లడయ్యేందుకే ఈ సర్వే ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాశం రాజేందర్, వెన్న శివకుమార్, నవీన్‌కుమార్, ఆదిమూలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో పూర్తయిన స్టిక్కరింగ్ ప్రక్రియ..

చాంద్రాయణగుట్ట: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రజల నుంచి వివరాలు సేకరించే ప్రక్రియ పాతబస్తీలో సోమవారం నుంచి కొనసాగనుంది. జిల్లాల్లో ఈ ప్రక్రియ శనివారమే పూర్తయినప్పటికీ, ఇక్కడ కుటుంబాల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించడంలో ఆలస్యం కావడం, ఫారంలు కూడా ఇప్పటికీ ఎన్యుమరేటర్లకు అందలేదు. ఈ క్రమంలోనే శనివారం అన్ని కుటుంబాలకు స్టిక్కరింగ్‌ను పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కుల గణనకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా నాలుగు నియోజకవర్గాలలో అధికారులు స్టిక్కరింగ్ ప్రక్రియను శనివారం పర్యవేక్షించారు.

సన్మానం



గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్ బదిలీపై హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. దీంతో శనివారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్‌తో పాటు ఎస్సైలు, సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలతో తెలిపారు. 33/11కేవీ ఆసిఫ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రేతిబౌలి, ఫుడ్ వరల్డ్, మిడ్ వే కాలనీ, పుల్లారెడ్డి కళాశాల, సంతోష్‌నగర్, మెహిదీపట్నం, జాన్‌దార్ నగర్, ఆర్ఎస్ బ్రదర్స్, చందన బ్రదర్స్, చెన్నై షాపింగ్ మాల్, అయోధ్యనగర్, మెహిదీపట్నం బస్టాప్ పరిసర ప్రాంతాలు, పద్మనాభనగర్, లక్ష్మీనగర్, కరోల్‌బాగ్, సాయిబాబా ఆలయం, పీఅండ్‌టీ కాలనీ, కాస్ట్ టు కాస్ట్, రేతిబౌలి పెట్రోల్ పంపు, లెదర్ ఫ్యాక్టరీ, ఉడిపో హోటల్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

సుల్తాన్‌బజార్: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఓ యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..చాదర్‌ఘాట్ ఉస్మాన్‌పురాకు చెందిన కుమిత్‌కుమార్ సింగ్ (27) విద్యార్థి. జల్సాలు చేసేందుకు విలాసవంతమైన జీవితం కోసం దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ నెల 7న అర్ధరాత్రి సమయంలో హనుమాన్‌టేక్డీ వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా ఉన్న దర్గా బుక్ బైండింగ్ షాప్ వద్ద పార్కు చేసిన యమహా ఎంటీ–15 ద్విచక్ర వాహనాన్ని నకిలీ తాళాలతో స్టార్ట్‌చేసి బైక్‌ను ఎత్తుకెళ్లాడు. అదేవిధంగా ఫిబ్రవరి 16న ఉదయం సమయంలో బ్యాంక్ స్ట్రీట్‌లోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వద్ద పార్క్ చేసిన యాక్టివా వాహనాన్ని దొంగిలించాడు. ఈ వాహనాల పార్ట్స్‌ను విప్పి అమ్ముకొని డబ్బును సంపాదించే వాడు. తోట అఖిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు కుమిత్‌కుమార్ సంగ్‌ను అరెస్టు చేసి తని వద్ద రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, సుల్తాన్ బజార్ పీఎస్‌లో ఒక కేసు నమోదు అయి ఉన్నాయి. ఈ కేసును ఎస్ఐ.నరేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్ర రైతాంగం ఎన్నో అవస్థలు పడుతుందని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్న రైతు సానుకూల నిర్ణయాలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయని అందువల్లే వారు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణ తదితరులున్నారు.


సభ్యత్వ నమోదులో శ్రీధర్‌రెడ్డి, దేవర శ్రీనివాస్ తదితరులు

ముగిసిన వర్క్‌షాప్

అబిడ్స్: మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఓటీ సిస్టమ్స్ డిజైన్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. కళాశాల ఈఈఈ విభాగం, ప్రజ్ఞాత్మిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సహకారంతో ఐఓటీ సిస్టమ్స్ డిజైన్‌పై ఈ నెల 4న ప్రారంభమైన వర్క్‌స్‌షాప్ ముగిసింది. వర్క్‌షాప్ ప్రత్యేకంగా ఈఈఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఈఈఈ హెచ్‌ఓడీ మస్తానమ్మ తెలిపారు. ఐఓటీ సిస్టమ్‌లను నడిపించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ భాగాల గురించి విద్యార్థులు లోతైన జ్ఞానాన్ని పొందారని తెలిపారు. సెషన్‌లో ప్రయోగాత్మక శిక్షణ, విద్యార్థులు, వాస్తవ ప్రపంచ సాధనాలు, పరికరాలతో పనిచేసేలా చేయడం వంటి వాటిని కవర్ చేసినట్లు పేర్కొన్నారు.


సర్టిఫికెట్లను అందజేస్తున్న ఈఈఈ హెచ్‌ఓడీ మస్తానమ్మ తదితరులు

ఘనంగా ఉర్దూ భాషా దినోత్సవం


ఉర్దూ డేలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు

గోల్కొండ: గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ప్రపంచ ఉర్దూ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ.. ప్రముఖ కవి అల్లామా ఇక్బాల్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఉర్దూ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఉర్దూ ఎంతో సరళమైన భాషా అని ఆమె అన్నారు. పద్య, గద్య రూపంలో ఉర్దూ భాష వినసొంపుగా ఉంటుందన్నారు. అల్లామా ఇక్బాల్ కారణంగా ఉర్దూ భాష కు మన దేశంలో ఆదరణ పెరగడమే కాకుండా ప్రాచుర్యం కూడా పొందిందని ఆమె అన్నారు. తెలంగాణలో ఉర్దూ రెండవ అధికారిక భాషగా ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ముబీనాతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెత్తపై విద్యార్థుల సమరం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుసంధానంగా ఉన్న క్రీడా మైదానంలో స్థానికులు చెత్త పడేయడంపై విద్యార్థులు నిరసన ర్యాలీకి దిగారు. నిత్యం అదే మైదానంలో ఉదయం పూట ప్రతిజ్ఞ చేయడం.. ఆటలాడేది కావడంతో చెత్త కంపుతో భరించలేక పోతున్నామంటూ విద్యార్థులు నినదించారు. ఇలా చెత్తను అవగాహన రాహిత్యంతో మైదానంలో పడేస్తుండడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్న విషయమై ఎన్నోమార్లు ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. చేసేది లేక విద్యార్థులు శనివారం ఉదయం ప్లకార్డులు చేతబూని చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ రహదారి, కుమ్మర్‌వాడీ, గాంధీ విగ్రహం వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి, చెత్త వేయరాదంటూ నినాదాలు చేశారు.


చాంద్రాయణగుట్ట ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎల్‌క్యూ యంగ్ థింకర్‌కు బీపీడీఏవీ విద్యార్థి ఎంపిక


విదిష

సంతోష్‌నగర్: బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి విదిష కుమారి లాగ్ లిక్విడ్స్ ఒలింపియాడ్‌లో విజయం సాధించి టెక్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఐఐటీ ముంబైలో జరిగే ఎల్‌క్యూ యంగ్ థింకర్ చాలెంజ్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ తెలిపారు. విద్యార్థుల జిజ్ఞాసను మెరుగుపరిచేందుకు, వారిని నిత్య నూతనంగా తీర్చిదిద్దేందుకు బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాల ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్‌రావు, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ ఆనంద వల్లి, ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్, బీడీఎల్ మిధాని ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థిని అభినందించారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో శ్రీకాంత్‌చారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళీ అమ్మవారికి గోల్కొండ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వకర్మ సోదరులకు అన్నింటా శుభం కలగాలని ఈ పూజలు నిర్వహించామని విశ్వకర్మ సంఘం ప్రతినిధులు సాయిబాబాచారి, సురేష్‌చారి తెలిపారు. పూజల్లో సంఘానికి చెందిన బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


దేవర కరుణాకర్ క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దేవర వంశీ

గోల్కొండ: గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ అడుగు జాడల్లో నడుస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని బీజేవైఎం నాయకుడు దేవర వంశీ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేవర కరుణాకర్ ప్రోత్సాహంతో నేడు అనేక మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 50 టీమ్‌లు పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు అశ్విన్, సాగర్ తదితరులున్నారు.

'అంబటి కుండలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో యువ రచయిత కె.విశ్వనాథ్ రచించిన 'అంబటి కుండలు'పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న స్థితిగతులపై సందేశాత్మకంగా రచించారని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రసమై సంస్థ అధ్యక్షుడు ఎంకే రాము, కవయిత్రి శశిబాల, సినీ దర్శకుడు నాగబాల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ఎంతో ముఖ్యం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జానారెడ్డి

గన్‌ఫౌండ్రీ: మానవ మనుగడకు నీటి సంరక్షణ ఎంతో ముఖ్యమని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ సమతుల్యత మరియు వ్యవసాయ ఉత్పాదక కోసం సహజ, మానవ నిర్మిత జలాలను పరిరక్షించడం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్ద పెద్ద సంస్థలు గ్రామాలను దత్తత తీసుకొని మంచినీటి సంరక్షణ, నిర్వహణ పద్ధతులను పెంపొందించడానికి తోడ్పాటును అందించాలని సూచించారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు ముందుకు వచ్చి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. అనంతరం నీటిపారుదల, నీటి సంరక్షణ వంటి అంశాలపై పలువురు పర్యావరణ వేత్తలు ప్రసంగించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆర్థిక సంఘం అధ్యక్షుడు డి.గంగాధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీని స్ఫూర్తిగా తీసుకోవాలి


నాగబాల సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా కవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితా పోటీలను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రసమై సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎంకే.రాము మాట్లాడుతూ..యువ కవులు, రచయితలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ప్రజా కవి కాళోజీని యువ కవులు, రచయితలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు 150 మంది కవులు కాళోజీపైన కవితలను చదివి వినిపించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన కవులను బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, దర్శకులు వి.రాంబాబు, కవయిత్రి శశిబాల సినీనటుడు వెంకట స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ఇషాక్


ఆటోడ్రైవర్‌ను అభినందిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు

చాంద్రాయణగుట్ట: కొందరు ఆటోడ్రైవర్లు ప్రయాణికులకు అసౌకర్యం కలిగించేలా, ర్యాష్ డ్రైవింగ్‌లతో ప్రమాదాలు చేస్తూ ఉండడం తరచూ చూస్తూ ఉంటాం. కాని శనివారం సాయంత్రం ఫలక్‌నుమాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఓ ఆటోడ్రైవర్ ఇషాక్ ఆహార్యం అబ్బురాన్ని కలిగించింది. ఇషాక్ ఖాకీ యూనిఫారం ధరించి, తన పేరుతో నేమ్ ప్లేట్, లైసెన్స్ నంబర్‌ను కూడా ముద్రించి అమర్చుకున్నాడు. ఇది గమనించిన ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మోహన్ రావు, ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఆయనను అభినందనలు తెలియజేశారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రతి ఒక్కరు ఇతన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.